స్కెచ్

# ధర్మం ఖాతా

"శారద"

మున్సిపల్ గరల్ స్కూలుకి ఎదురుగా నిదర గన్నేరు చెట్టుకింద వేరుశనగకాయలు, పుటుకులూ అమ్మే ముసలమ్మకి ఎన్నేళ్లుంటాయో అని ఊహించటం అనవసరం. అసలు ఆమె చిరంజీవి అనికూడా ఒకరిద్దరు అంటూవుండడం కద్దు. చెట్టునీడనే నివసిస్తుంది. వర్షంవొస్తే ఎదురుగా వున్న స్కూలు అరుగుమీదకి పోతుంది. ఆమెకి అందరూ పరిచయులే. ఆమె అప్పుకూడా పెడ్తుండేది పిల్లలకి. ఆమె ఆదాయం ఎంతో ఎట్లా దినంగడిపేదో ఏ ఆర్థిక శాస్త్రవేత్తా నిర్ణయించలేడు. అంత స్వల్పఆదాయంతో ఒకవ్యక్తి ఇన్నేళ్లుగా జీవించటం ఎట్లా సాధ్యమైంది అనేది, ఏ శరీరశాస్త్రజ్ఞుడైనా నిర్ణయించవల్సిన విషయం. ఆమె ఉదయంలేచి, వేరుశనగకాయల కొట్టుకిపోయి, తనకవసరమైన వేరుశనగకాయలు, ఇంకోచోట పుటుకులూ తెచ్చి సాయంత్రందాకా అమ్ముకుంటూ వుండేది. ఆమె పేరు రోశమ్మ అని గర్వంతో స్కూలు ప్యూన్-అతనొక్కడే ఆమెకి సన్నిహితుడు అంటూండేవాడు. అతనైనా తీరికసమయాల్లో ఆమెతో ఏదో కులాసా కబుర్లాడ్డంవరకేగాని, ఇతరంగా ఆమెకి చేసినసహాయం ఏమిన్నీ లేదు.

ఆమె పెట్టుబడి మహా ఉంటే రూపాయి, రూపాయి, పావలా వుండచ్చు. రూపాయి వేరుశనగకాయలు, పావలా పుటుకులూ తెచ్చిఅమ్మితే ఆమెకి మిగిలేవి, ఆరు అణాలు, ఏడణాలూ. అందులో, నూకలు, అణా మిరపకాయ వగైరా, అణా కట్టెలు. ఇంతే, ఆమె జీవితం. దీనికి ఏ విఘాతమూ రాదని గట్టివిశ్వాసంతో పని చేస్తుండేది. ఆమె కొక కూతురుండేదనీ, ఆమె ఇప్పుడు ఎక్కడో పల్నాటిసీమలో వుందనీ, గరల్స్ స్కూలు ప్యూన్ ఇచ్చిన వర్తమానం.

అది ఎండాకాలం రోజు. వుదయం పది గంటలకే ఎండ నిప్పులు చెరుగుతోంది. రోడ్డుమీద దుమ్మును, మానవుల కళ్ళల్లోకి ముక్కుల్లోకి ఎక్కిద్దామన్న ఒకే నిర్ణయంతో గాలి తీవ్రంగా పని చేస్తూ వుంది. చెప్పులు తొడుక్కుని గొడుగేసుకుని రోడ్డుమీద నడిచేవాళ్ళు గూడా ఎండ దెబ్బకి హడలుతున్నారు. మేడల్లో నివశించే లక్ష్మీపుత్రులు ఎలక్ట్రిక్ పంకాల చల్లగాలిలోనే బహు చిరాకుగా వుంటున్న వేళ అది. రోశమ్మ, తను కూర్చునే పట్టా మడతపెట్టి పక్కనపెట్టి కొంగున ముడేసుకున్న రూపాయి బిళ్ళ అణా బిళ్ళ సరిగ్గావున్నయో లేదో చూసుకుని, వేరుశనగ టోకుకొట్టుదగ్గరకి బయల్దేరింది. అదే ఆమెకి విశ్రాంతి కాలం. వొళ్ళంతా చమట పోస్తూవుంది. ఆరుచోట్ల నులకతాడు కట్టున్న పాత చెప్పులు తొడుక్కుని ముసలమ్మ నిదానంగా, బజార్లవెంట పోయిపోయి అరగంట కాలానికి వేరుశనగకాయల కొట్టుకి చేరుకుంది.

షావుకారు నడికారు మనిషి. కాస్త సరసంగా మాట్లాడ్డంకద్దు. ముసలమ్మ అంటే అతనికి ఎక్కడలేని సరదా!

"ఏం ముసలమ్మా! ఇంకా బేరం చేస్తునే వున్నావు?" అన్నాడు ఎగతాళిగా.

ముసలమ్మ ఉస్సురనుకుంటూ పెద్దపెద్ద వేరుశనగ బుట్టలపక్కన కూర్చుని, కుడి చేత్తో పొట్ట చూపుతూ "ఇది నిండొద్దు నాయనా!" అంది.

"సంపాయించిదంతా ఏం చేస్తున్నావు?" అన్నాడు షావుకారు.

ముసలమ్మ అర్థస్ఫూర్తిగా నవ్వింది. అంతే, ఏమీ సమాధానం చెప్పలేదు.

షావుకారు వ్యాపార సరళిలోకి దిగుతూ, "ఇవాళ ఎన్నికాయలు కొల్వను?" అన్నాడు.

"ముప్పావులావి కొలు శెట్టిగారు!" అంది ముసలమ్మ, రొంటినివున్న రూపాయిబిళ్ళ జాగ్రత్తగా తీసి షావుకారికిస్తూ.

షావుకారు అతని అలవాటు ప్రకారం

రూపాయిబిళ్ళ జాగ్రత్తగా పరిశీలించిచూసాడు. రెండునిమిషాలయినాక, "ముసలమ్మా. ఇది ఫ్రూటా రూపాయి మారదు. ఇంకోటీ!" అన్నాడు.

ముసలమ్మకి గుండె ఆగినంత పని అయింది. "ఇంకో రూపాయి లేదే శెట్టిగారు అంది" ముసలమ్మ.

"నన్నేం చెయ్యమన్నావ్?" అన్నాడు షావుకారు.

"ఎట్టాగో చూడు బాబు... బాబు!" అంది ముసలమ్మ జాలిగా. ఆమె బతుకు బెరువంతా ఆ రూపాయిమీదే ఆధారపడిఉంది మరి!

షావుకారు ఇంకోసారిఅటూఇటూతిప్పిచూసి, "నేనెట్లాగో తంటాలుపడతానుగాని ముసలమ్మా, దీనికి ముప్పావలా ఇస్తానంతే!" అన్నాడు.

ముసలమ్మ రెండు నిమిషాలు ఆలోచించింది. "సరేలే అయ్యా! వేరుశనగకాయలెయ్యి ఆ డబ్బులకి" అంది నీరసంగా.

షావుకారు ఆమె వొడిలోకి ముప్పావలా వేరుశనగకాయలు కొలిపించాడు గుమస్తాకుర్రాడి చేత.

ముసలమ్మకి ఆఫ్రూటనూకలు ఖాళీఅయ్యాయి. మార్కెట్టు దగ్గిర పంపులో నీళ్లుతాగి, తన నివాసస్థానానికి చేరుకుందామె ఊసురుమనుకుంటూ.

ఆమె వెళ్ళాక షావుకారు గుమాస్తాతో అన్నాడు, "ఈ ముండదగ్గిర డబ్బులు బాగానే వున్నాయి. ఇట్లా దమ్మిడీలు పోగుచేసి ఏ కూతురుకో, కొడుక్కో పంపుతుంది!" అన్నాడు వెటకారంగా.

గుమాస్తా పైకి తలూపాడు. లోపల అనుకున్నాడు, "అది మంచిరూపాయల్లే ఉందే"అని.

వాళ్ళు ఆ రాత్రి కొట్టు కట్టెయ్యబోతూ లెక్కలు చూసుకుంటున్నారు.

గుమస్తా, లెక్కల పుస్తకంలోకి చూస్తూ, "పావలా హెచ్చువస్తోందండి! ఏ లెక్క రాయమన్నారు?" అని అడిగాడు.

గల్లాలోడబ్బులు సంచీలోకి పోస్తున్న షావుకారు, "ధర్మం ఖాతాలోకి జమరాయి"అన్నాడు నిర్లక్ష్యంగా.

మర్నాడూ గడిచిపోయింది; ఆ మర్నాడు మధ్యాహ్నం మూడుగంటలకు, గరల్సు స్కూలు ఫ్యూనూ, ఇంకా ఇద్దరు రిక్షావాలాలూ, ఓ పళ్లెంపట్టుకుని కొట్టుకొట్టుకూ తిరుగుతూ, వేరుశనక్కాయల కొట్లోకివొచ్చారు.

"బాబూ, అనాదండి, చచ్చిపోయింది. దాన్ని మట్టిచెయ్యాలి. ఏదో మీకు తోచిన ధర్మంచెయ్యం"అన్నాడు స్కూలు ఫ్యూను.

వేరుశనక్కాయల షావుకారు,"పొండిపొండి. ఇదొక వృత్తి అయిపోయింది మీకు" అని కసురుకున్నాడు.

కాని వచ్చినవాళ్ళు వదలలేదు. వాళ్ళచేతిలో పళ్లెంలో అన్నిరకాల నాణ్యాలూకలిసి రెండూ, రెండున్నర వుంటాయి. ఇంకా ఎంతో కావాలి. ఈ పొద్దు కూకేసరికి శవాన్ని పూడ్చిపెట్టాలి. వాళ్ళు మొండికేసి కూచున్నారు కొట్టుముందు.

షావుకారు విసురుగా అన్నాడు: "మీకు అంత ఆక్కరవుంటే మీరే తలో రూపాయి చందావెయ్యలేకపోయారా?"అని.

ఫ్యూనుకి ఒక సంగతి చటుక్కున జ్ఞాపకం వొచ్చింది. "అయ్యగారు! ఆ ముసలమ్మ మీ దగ్గిరే రోజూ వేరుశనక్కాయలు కొనుక్కునేదండి! దానికి ఎవరున్నారు? ఆ చెట్టుకింద చచ్చి పడివుంది. మీరుకూడా అట్టాఅంటే ఎట్టా?" అన్నాడు విచారంగా.

షావుకారు తాపీగా పెట్టితెరిచి, ఒక పావలా బిళ్ళ వాళ్లపళ్ళెంలో పడేసి, "మొన్నకూడా వచ్చిపోయిందిగా! ఇంతలోచచ్చిందే?ఏంజబ్బో?" అని ప్రశ్నించాడు.

"జబ్బేటిండి! మూడురోజులుగా తిండితిన్నట్టు లేదు! ముసలిముండాయె! ఈ యెండలకు తిండి లేకపోతేవడదెబ్బకొట్టదూ? అడేగాలవాల, రాత్రి చచ్చి వూరుకుంది!"అని వాళ్లకితోచిన కారణం వాళ్లు చెప్పి ఇంకో కొట్టుకి వెళ్ళారు ఆ ధర్మాత్ములు.

వాళ్ళు వెళ్ళాక షావుకారు గుమాస్తాతో అన్నాడు. "ముసిల్ది గట్టిదోయ్; చచ్చికూడా పావలా వసూలుచేసిందిగదా!"అని.

గుమాస్తా లెక్కచూస్తూ "ఆ పావలా ఖర్చు రాయొద్దూ?"అని ప్రశ్నించాడు.

షావుకారు "ధర్మంఖాతా ఖర్చురాయ్!" అన్నాడు నిశ్చలంగా.